క్లుప్తంగా

98.12 శాతం పింఛన్ల పంపిణీ



పాములపాడులో వృద్ధురాలు వెంకటలక్ష్మికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ రేణుక

పాములపాడు: పింఛన్ పంపిణీని 98.12 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలో మొత్తం 5,944 మంది పింఛన్ దారులున్నారని, ఇప్పటి వరకు 5,832 మందికి పంపిణీ చేసినట్లు చెప్పారు.

22 ఏళ్లుగా.. పల్స్ పోలియో కార్యక్రమంలో



బస్టాండ్ సెంటర్ చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న షర్ఫుద్దీన్ అలీ

పాములపాడు: మండల కేంద్రంలో సేవాభారతి అధ్యక్షుడు షర్ఫుద్దీన్ అలీ 22 సంవత్సరాలుగా జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో స్వచ్ఛందంగా పాల్గొంటూ సేవలందిస్తున్నాడు. సోమవారం స్థానిక బస్టాండ్ సెంటరులో ఏర్పాటు చేసిన పోలియో బూత్ వద్ద చిన్నారులకు పోలియో చుక్కలు వేశాడు. కాగా.. గత నాలుగేళ్ల నుంచి పల్స్ పోలియో కార్యక్రమంలోనే కాకుండా ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ స్వచ్ఛందంగా సేవలందిస్తున్నాడు.

శ్రీశైలంలో ముగిసిన 'గామి'



మీడియాతో మాట్లాడుతున్న విశ్వక్‌సేన్

శ్రీశైలంటెంపుల్: గామి సినిమా వారణాసిలో ప్రారంభమై కుంభమేళాలలో తిరిగి చివరికి శ్రీశైలంలో ముగిసిందని సినీ హీరో విశ్వక్‌సేన్ తెలిపారు. సోమవారం శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను గామి చిత్ర బృందం దర్శించుకుంది. స్థానిక రుద్రాపార్క్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరో మాట్లాడుతూ తాను నటించిన గామి సినిమా శివరాత్రి రోజున విడుదల అవుతుందన్నారు. అలాగే సాయంత్రం శంకర మహాదేవన్ శివుడిపై పాడిన పాటను విడుదల చేశారు. నిర్మాత కార్తీక్, ప్రొడక్షన్ మేనేజర్ రాహుల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు వై.పి.చలమారెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న డబ్బు అందజేత



లక్ష్మికి నగదు అందిస్తున్న రంగన్న

మహానంది: మహానందీశ్వరుడి దర్శనార్థం బళ్లారి జిల్లా హెచోషాల్ గ్రామానికి చెందిన రామోళి లక్ష్మీ సోమవారం కుటుంబ సభ్యులతో వచ్చారు. బయటికి వచ్చాక తన వద్ద ఉన్న డబ్బును పోగొట్టుకున్న విషయం తెలుసుకుంది. వెంటనే టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రంగన్నకు సమాచారమివ్వడంతో సీసీ కెమెరాల పర్యవేక్షకుడు శివాచారి పుటేజీలను పరిశీలించి డబ్బులు తీసుకున్న వారు ఆలయ ప్రాంగణంలో ఉన్నట్లు గుర్తించారు. వారి నుంచి రూ. 13వేల నగదును అందించడంతో కృతజ్ఞతలు తెలిపారు.

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ



డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టిన పోలీసులు

పగిడ్యాల: ఆరబెట్టిన పొగాకు తోరణాలకు నిప్పంటించిన నిందితుల ఆచూకీని గుర్తించేందుకు ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ సోమవారం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు. వాసనను పసిగట్టిన డాగ్ నిందితులు తిరిగిన ప్రదేశాల చుట్టూ తిరిగి చివరకు మందు తాగిన వేప చెట్టు కిందకు వచ్చి నిలిచింది. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరిపైనైనా అనుమానం ఉంటే తమ దృష్టికి తేవాలని బాధిత రైతు సుధాకర్‌కు సూచించారు. నిందితులపై చర్యలు తప్పవన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల ప్రాముఖ్యతను తెలియజేయండి



ఇంటింటికీ వెళ్లి విచారిస్తున్న రామ్‌నాథ్

జూపాడుబంగ్లా: ఆరోగ్యశ్రీ కార్డుల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయటంతో పాటు సత్వరమే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీకార్డులు అందజేయాలని వైద్య, ఆరోగ్యశాఖ రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ రామ్‌నాథ్ తెలిపారు. సోమవారం స్థానిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆరోగ్యకేంద్రానికి ఎన్ని ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరయ్యాయి, ఎన్ని పంపిణీ చేశారని డాక్టర్ గంగాధర్‌ను ప్రశ్నించారు. పంపిణీ చేయని వాటిని వెంటనే లబ్ధిదారులకు అందజేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి కార్డులు అందాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో డాక్టర్ సునీత, డాక్టర్ గంగాధర్, డాక్టర్ సభా, సీహెచ్‌ఓ వహబ్, సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ పాల్గొన్నారు.

మమ్మేలుకో మల్లన్న

మల్లన్న.. మల్లయ్య.. అంటూ భక్తులు శ్రీశైల మల్లికార్జునుడిని ప్రేమగా పిలుచుకుంటారు. భక్తితో కొందరు, కోర్కెలు తీరాలని కొందరు దీక్ష బూని పరమ శివుడి దర్శనం కోసం నల్లమల అడవి గుండా పాదయాత్రగా శ్రీగిరి చేరుకుంటున్నారు. ఇలా ఏటేటా భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఇక పాదయాత్రికలకు సేవలందించేందుకు కొందరు దాతలు తమ వంతుగా అన్నదానం, వైద్య శిబిరాలు, మజ్జిగ, నీటి కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు.

- ఏటేటా పెరుగుతున్న శివమాలధారుల సంఖ్య
- అటవీ మార్గంలో కాలినడకన శ్రీగిరి చేరుకుంటున్న భక్తులు
- శివనామస్మరణతో మారుమోగుతున్న నల్లమల గిరులు
- పాదయాత్రికల సేవలో దాతలు



నాగలూటి మెట్ల మార్గం ద్వార పాదయాత్ర చేస్తున్న భక్తులు



వెంకటాపురం నుంచి కాలినడకన బయల్దేరుతున్న భక్తులు

ఆత్మకూరు: 'శ్రీశైల లింగం..శిరసానమామి' శ్రీశైల క్షేత్రంలో వెలసిన మల్లికార్జునుడిని స్పర్శదర్శనం చేసుకుంటే కోటి జన్మల పుణ్యఫలం లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అది కూడా శివ దీక్ష బూని దర్శించుకుంటే మరింత మంచిదనే నమ్మకంతో మాలధారణ గావించి స్వామిని దర్శించుకునేందుకు నల్లమల్లలోని కష్టతరమైన ప్రయాణాన్ని సైతం లెక్క చేయకుండా కాలినడకన శ్రీగిరి చేరుకుంటున్నారు. ఇలా ఏటేటా పాదయాత్రగా వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది.

ఇలా చేస్తే పాదయాత్రలో ఇబ్బందులను అధిగమించొచ్చు..

- మంచినీటి బాటిల్ లేనిదే నడక సాగించవద్దు.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తారు రోడ్డుమీద నడక సాగించరాదు. దీనికి బదులుగా పక్కన ఉన్న మట్టిలో నడవాలి.
- నాగలూటి, భీమునికొలను వద్ద మెట్ల మార్గంలో 5, 10 మెట్లు ఎక్కిన వెంటనే కొంత సేపు విశ్రాంతి తీసుకోవాలి.
- మహిళలు, వృద్ధులు, చిన్నారులు అలసట అనిపించిన వెంటనే విశ్రాంతి పొందాలి.
- నాగలూటి,పెచ్చెర్వు, భీమునికొలను, కైలాసద్వారం వరకు పగటి పూట మంచినీటి బాటిళ్లు తప్పనిసరి. ఎండ అధికంగా ఉన్న సమయంలో చెట్ల కింద సేద తీరాలి.
- అనారోగ్యమనిస్తే వైద్య శిబిరాల్లో చికిత్స పొందాలి. బలవంతంగా ముందుకు సాగడం మంచిదికాదు.
- రాత్రివేళ టార్చ్‌లైట్ తప్పనిసరిగా ఉపయోగించాలి. ప్రధానంగా కత్తుల కొండ, భీమునికొలను వద్ద టార్చ్‌లైట్ లేకపోతే ప్రమాదాలు జరిగే అవకాశముంది.

గోనే సంచులు కట్టుకుని..

శ్రీశైల మహాక్షేత్రానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కాలినడకన భక్తులు తరలివస్తున్నారు. ముఖ్యంగా కర్ణాటక రాష్ట్రం నుంచి ఈ సంఖ్య అధికంగా ఉంటుంది. ఎండకు తాళలేక కాళ్లకు సాక్సులు, గోనెసంచులు, గుడ్డ ముక్కలు కట్టుకుని నడక కొనసాగిస్తున్నారు. ప్రధానంగా నల్లమల అటవీమార్గంలో కొండాకోనల వెంట అతికష్టమైనా అక్కడక్కడా సేద తీరుతూ శ్రీశైలానికి వెళ్తున్నారు. కాళ్లనొప్పులు పెట్టినా.. బొబ్బలెక్కినా లెక్కచేయక మల్లన్నపై భక్తితో ముందుకు సాగుతున్నారు.

నాగలూటి, కత్తులకొండ, భీమునికొలను మార్గం అతికష్టం..

కాలినడకన వెళ్లే భక్తులు నాగలూటి వీరభద్రస్వామిని దర్శించుకుని మెట్ల మార్గం ద్వారా నాగలూటి నుంచి పెచ్చెర్వు చేరుకునే లోపు కష్టాలు మొదలవుతాయి. వందల సంఖ్యలో ఉన్న మెట్ల వెంట మల్లన్న దర్శనం కోసం వచ్చే భక్తులు పడే ఇబ్బందులు అంతా ఇంతా కాదు. మెట్టు మెట్టు ఎక్కుతూ 'ఓం నమఃశివాయ' పంచాక్షరీ మంత్రం పఠిస్తూ ముందుకు వెళ్లడం ఒక ఎత్తయితే.. భీమునికొలను చేరుకునే మార్గంలోని కత్తుల కొండ ఓ పరీక్షే. నల్లమల కొండలోని ఎర్రరాళ్లు ఎత్తులను పోలి ఉంటాయి. పాదయాత్రలో కత్తుల్లాంటి రాళ్లను దాటుకుని వెళ్లే క్రమంలో పాదాలకు రాళ్లు గుచ్చుకుని రక్తం కారుతున్నా మల్లన్న మీద ధ్యాసతో పట్టనట్లుగా పాదయాత్ర సాగిస్తారు. భీమునికొలనులో దిగి కైలాసద్వారం చేరుకోవడానికి భక్తులు పడే పాట్లు అంతా ఇంతా కాదు. ఇంత కష్టమైనా.. కాలినడకన వచ్చేందుకే భక్తులు మక్కువ చూపుతున్నారు.

సేవా శిబిరాలు..

కాలినడకన వెళ్లే భక్తులు, శివ మాలధారులకు అడుగడుగునా అన్నదాన శిబిరాలను దాతలు ఏర్పాటు చేశారు. తమ తొలి పర్యటనలో ఏర్పడిన అనుభవాలను పాఠంగా తీసుకొని మిగిలిన వారు ఇబ్బందులు పడకూడదని కొందరు శిబిరాలను ఏర్పాటు చేస్తుండగా, మరికొందరు భక్తులకు సేవ చేసేందుకు తమ వంతుగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో నేడు గ్రామ గ్రామాన వైద్య శిబిరాలు, అన్నదాన కేంద్రాలు, మజ్జిగ, నీటి కేంద్రాలు అనేకం దర్శనమిస్తున్నాయి. కొందరు కాలినడక భక్తుల కాళ్లను శుభ్రం చేసి అలసట పోయేలా కాళ్లకు మసాజ్ చేయడం లాంటివి చేస్తుండటం విశేషం.

గోనె సంచులే పాదాలకు రక్ష



కాలినడకన వెళ్లి మల్లన్న దర్శనం చేసకోవడం వలన ఇబ్బందులు పడేవారు గోనె సంచులను కట్టుకుంటే కొంత వరకు రక్షణ లభిస్తుంది. గత ఐదేళ్ల నుంచి వెంకటాపురం నంచి ఇలా గోనె సంచులు కట్టుకుని కాలినడకన వెళ్తున్నా. ప్రస్తుతం 6 రోజులుగా పాదయాత్ర కొనసాగిస్తున్నా. సంచుల వల్ల కాళ్లకు బొబ్బలు రావు.

–వీరన్న, కర్నూలు

బొబ్బలెక్కినా ఇబ్బందులు పడలేదు



నేను ఆదోని నుంచి పాదయాత్ర సాగిస్తున్నా. బొబ్బలెక్కినా ఇబ్బంది పడలేదు. అక్కడక్కడ వైద్యశాలల్లో మందులు తీసుకుంటూ ముందుకు సాగాను. అన్నదానాలు, వైద్యశిబిరాల ద్వారా ఎంతో ఉపశమనం లభించింది. నొప్పులు ఉన్నప్పటికీ మల్లన్న దర్శనం కోసం వెళ్తుండటం ఆనందంగా ఉంది.

– మారెన్న, ఆదోని



గానం: భక్తిగీతాలు ఆలపిస్తున్న గాయకులు

శ్రీగిరిలో ఓంకార ధ్వనులు

శ్రీశైలంలో బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. సోమవారం కళాకారులు తమ ప్రదర్శనలతో భక్తులను అలరించారు.

– శ్రీశైలం టెంపుల్



నాట్యం: శివతాండవం చేస్తున్న కళాకారుడు



రౌద్రం: రాక్షస సంహార ప్రదర్శన

ప్రతిపక్షాలు మూట సర్దుకోవాల్సిందే



తర్తూరులో ప్రచారం చేస్తున్న దారా సుధీర్, నాయకులు

జూపాడుబంగ్లా: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధితో జనం జగనన్న వెంటే నిలుస్తున్నారని ప్రతిపక్షాలకు అర్థమైందని, ఎన్నికల తరువాత వెళ్లిపోయేందుకు మూటా ముల్లె సర్దుకోవాలని వైఎస్సార్‌సీపీ నందికొట్కూరు సమన్వయకర్త దారా సుధీర్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని తర్తూరు, భాస్కరాపురం, తరిగోపుల, రామసముద్రం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ తాను ఇంటింటికి వెళ్లి పరిచయం చేసుకొంటున్న సమయంలో జగనన్న అమలుచేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ లబ్ధిపొందినట్లు తెలుపుతుండటం సంతోషంగా ఉందన్నారు. పాఠశాలలు కార్పొరేట్ స్థాయిలో ఉన్నాయన్నారు. గ్రామాల్లో కుళాయిలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పక్కా గృహాలు చూస్తుంటే ఆశ్చర్యమేస్తుందన్నారు. జెడీటీసీ జగదీశ్వరరెడ్డి, లాయర్ వెంకటరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ నాగార్జునరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, సర్పంచులు పెద్దముంతల నాగిరెడ్డి, గొల్లమాధవి, నరేష్‌రెడ్డి, జి.రవీంద్రారెడ్డి, శేషశయనారెడ్డి, యశ్వంత్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, పుల్లారెడ్డి, వలిబాషా, రంగారెడ్డి, ముర్తుజావలి, శ్రీనివాసరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సీఎం.రవీంద్రారెడ్డి, రామకృష్ణారెడ్డి, గోవిందు, గోపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నరసింహయాదవ్, పరిగె సుంకన్న, కృష్ణ, పుల్లయ్య, రాముడు, నడిపికోటి,సురేష్, ఈశ్వర్, పటాన్‌ఖాన్, సుబ్బు పాల్గొన్నారు.

మహానందికి బ్రహ్మోత్సవ శోభ

- రేపటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- రోజూ వాహనసేవలు, గ్రామోత్సవాలు
- 9న లింగోద్భవం, కల్యాణోత్సవం
- 10న రథోత్సవం, 11న తెప్పోత్సవం

మహానంది: ఈ నెల 6 నుంచి 11వ తేదీ వరకు మహానందిలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు రవి శంకర అవధాని తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా 6న మధ్యాహ్నం అంకురార్పణ, కలశస్థాపన, సాయంత్రం ధ్వజారోహణం పూజలు ఉంటాయన్నారు. అదే రోజు రాత్రి శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు మయూరవాహనంపై గ్రామోత్సవం ఉంటుందన్నారు. 7న ఉదయం సూర్యప్రభ వాహనసేవ, రాత్రి రావణవాహనసేవ ఉంటాయని చెప్పారు. 8న ఉదయం స్వామి, అమ్మవార్లకు శేషవాహనసేవ, రాత్రి నంది వాహనసేవ, అదేరోజు మహాశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ మహానందీశ్వరస్వామివారికి రాత్రి పది గంటల నుంచి మహారుద్రాభిషేకం అత్యంత వైభవంగా జరిపిస్తామన్నారు. 9న తెల్లవారుజామున మూడు గంటల నుంచి కల్యాణోత్సవం, ఉదయం సింహవాహనసేవ, పుష్ప పల్లకీసేవలు ఉంటాయని పేర్కొన్నారు. 10న ఉదయం గజవాహనసేవ, మధ్యాహ్నం మూడు గంటలకు మహా రథోత్సవం, రాత్రి పుష్పశయనోత్సవం పూజలు జరుగుతాయన్నారు. 11వ తేదీన మహాపూర్ణాహుతి, త్రిశూలస్నానం, ధ్వజ అవరోహణం, బ్రహ్మోత్సవ యాగఫల సమర్పణం పూజలు శాస్త్రోక్తంగా చేస్తామని, రాత్రి రుద్రగుండం కోనేరులో స్వామి,అమ్మవార్లకు తెప్పోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

మహానందిలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

మహానంది: క్షేత్రంలో భక్తజన సందడి కొనసాగుతుంది. శివరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండటంతో పాటు శ్రీశైలం ఆలయానికి వెళ్లే భక్తులు, తిరుగు ప్రయాణంలో మహానందిని దర్శించుకుంటుండటంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. వేలాది సంఖ్యలో హాజరైన భక్తులతో సందడిగా కనిపిస్తుంది. ఆలయానికి వచ్చిన భక్తులు శ్రీ కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వినాయకనంది, గరుడనంది ఆలయాలతో పాటు రాతినంది, పెద్దనంది ప్రాంతాలను తిలకించారు.



అష్టవిధ మహామంగళహారతుల సమయంలో దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

మిడుతూరు: మండలంలోని తలముడిపి – మంచాలకట్ట గ్రామాల మధ్యలో వెళ్లే రహదారిలో ఓ టిప్పర్.. రెండు ఆటోలు, బైక్ ఢీ కొట్టడంతో ఐదుగురికి తీవ్ర గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూరు నుంచి మంచాలకట్టమీదుగా గనికి కంకర కోసం వెళ్తున్న టిప్పర్.. గడివేముల గ్రామానికి చెందిన సిద్దయ్య, మౌలాబీ ద్వి చక్రవాహనంపై డోన్ పట్టణానికి వెళ్లి తిరిగి వెళ్తుండగా ఢీ కొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. అలాగే.. ఓర్వకల్లు మండలం కొమురేలు గ్రామానికి చెందిన దంపతులు దస్తగిరి, లీలావతి కూరగాయాలు అమ్ముకోవడానికి గడివేములకు ఆటోలో వస్తుండగా మంచాలకట్ట సమీపంలో అదే టిప్పర్ ఢీ కొట్టడంతో వారిని కర్నూలు ప్రభుత్వ హాస్పటల్‌కు తరలించారు. వడ్ల లోడుతో వస్తున్న మరో ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయి. టిప్పర్ డ్రైవర్ ముర్తుజావలి నిద్రమత్తుతోనే ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు. ఎస్‌ఐ జగన్ మోహన్ మాట్లాడుతూ టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని, ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.





గాయపడిన లక్ష్మీనారాయణ,మౌలాబీ

ఇళ్ల స్థలాలపై పేదలకు సర్వహక్కులు

- కడుపు మంటతో కోర్టుకెళ్తున్న పచ్చనేతలు
- పేదల గుండెల్లో నిలిచిన సీఎం జగన్
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



పేదలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: గతంలో పేదలకు ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చేవారని, వాటిని అమ్ముకునేందుకు, రుణాలు తీసుకునేందుకు ఎలాంటి హక్కులు ఉండేవి కాదు. నేడు మన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముందుచూపుతో లబ్ధిదారుల పేరుమీద రిజిస్ట్రేషన్ చేయించి ఇస్తుండటంతో ఇళ్లస్థలాలపై వారికి సర్వహక్కులు దక్కేలా చేస్తుందని ఏపీ శాసనసభ ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పేర్కొన్నారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం 1,604 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంపిణీకి సిద్ధం చేసిన ఇళ్ల స్థలాలపై టీడీపీ నాయకులు కోర్టులకు వెళ్లి అడ్డుకుంటుండటం బాధాకరమన్నారు. పేదలకు మంచి చేస్తుంటే వారికి కడుపుమంటగా ఉంది. ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలన్నారు. ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీ అందరి గుండెల్లో నిలిచిపోతారని, ఆయనకు మంచి పేరు వస్తుందన్న దుర్మార్గపు ఆలోచనలు కలిగిన చంద్రబాబు అండ్ కో ఎంతటి నీచానికైనా దిగజారుతారని మండిపడ్డారు. 14 సంవత్సరాలు అధికారంలో ఉన్న చంద్రబాబు ప్రవేశపెట్టిన ఒక్క పథకమైనా గుర్తుండిపోయిందా, చెప్పాలని ప్రజలను ప్రశ్నించారు. మంచి చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరో మారు ఆశీర్వదించాలని కోరారు. అలాగే బోధనం, సంతజూటూరు, నారాయణాపురం, చిన్న దేవలాపురం, లింగాపురం, కడమలకాల్వ, ఈర్నపాడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన రైతు సహకార సేవా కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్ రెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, ఎస్సీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, ఎస్టీ సెల్ స్టేట్ జాయింట్ సెక్రటరీ విక్రమసింహనాయక్, సీనియర్ నేత ఈర్నపాడు రామసుబ్బారెడ్డి, తహసీల్దార్ సుమతి, డీటీ హరిత పాల్గొన్నారు.

సైనికుల్లా కృషి చేయాలి..

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేయాలని ఎమ్మెల్యే శిల్పా పిలుపునిచ్చారు. సాయంత్రం పార్నపల్లెలోని టీటీడీ కల్యాణ మండపంలో పార్టీ కన్వీనర్లు, గృహసారధులు, బూత్‌కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు చిన్నచిన్న మనస్పర్థలను పక్కన పెట్టి కలిసికట్టుగా పనిచేయాలని హితవు పలికారు. పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన శివనాగయ్య ఆచారి రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకుని రూ. 5వేలు ఆర్థిక సాయం అందించారు.

చిన్నారుల జీవితం కోసం..



మహానంది: రెండు చుక్కలు జీవితానికి వెలుగన్న సందేశాన్ని ఆమె అక్షరాల పాటించింది. బండిఆత్మకూరు మండలం చిన్నదేవలాపురం గ్రామానికి చెందిన గిరిజనులు జీవనోపాధి నిమిత్తం వెలుగోడు మండలం మోతుకూరు గ్రామ సమీపంలోని చెరువు వద్ద ఉంటున్నారు. విషయం తెలుసుకున్న ఆశా కార్యకర్త అనూషతో పాటు గూడెంలో ఉంటున్న మల్లమ్మ మూడు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి రెండు గిరిజన చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేయడంపై అధికారులు అభినందించారు.

ఇంటర్ పరీక్షకు పది మంది గైర్హాజరు

మహానంది: బండిఆత్మకూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్ పరీక్షల్లో పది మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రామసుబ్బారెడ్డి తెలిపారు. ఈ కేంద్రంలో మొత్తం 210 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందని చెప్పారు.

పాములపాడు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు ఒక విద్యార్థి గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

వివాదస్పదంగా స్థలం కేటాయింపు

జూపాడుబంగ్లా: దళితుల శ్మశానవాటిక కోసం స్థలం కేటాయింపు వివాదాస్పదంగా మారింది. 80 బన్నూరు గ్రామంలో స్థలం సర్వే చేయాలని కొందరు, వద్దని మరికొందరు అడ్డు పడటంతో సోమవారం ఉద్రిక్తత నెలకొంది. దీంతో అధికారులు విషయాన్ని పోలీసులకు తెలియజేయటంతో బ్రాహ్మణకొట్కూరు, ముచ్చుమర్రి ఎస్‌ఐలు నాగార్జున, జయశేఖర్, జూపాడుబంగ్లా ఏఎస్‌ఐ వారి సిబ్బందితో గ్రామానికి చేరుకొని గ్రామస్తులను శాంతింపజేశారు. సమస్య జఠిలం కాకుండా గ్రామస్తులతో మాట్లాడారు. డీటీ చంద్రశేఖర్, మండల సర్వేయర్ షహనాపర్వీన్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వోలు, పాల్గొన్నారు.

అప్పుల బాధతో వ్యాపారి ఆత్మహత్య

పగిడ్యాల: అప్పుల బాధ తాళలేక జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం పగిడ్యాలలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీనరసింహయ్య అలియాస్ పాపోడు (48) జీవనోపాధి కోసం హోటల్ వ్యాపారం చేసేవాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొద్ది కాలం క్రితం కూతురు కావ్యకు పెళ్లి చేసి అత్తా రింటికి పంపారు. కుమారుడు లోకేష్ కర్నూలులో ఉన్నత విద్యను అభ్యసిస్తున్నాడు. ఈ క్ర మంలో కర్నూలులోని బంధువుల వద్ద డబ్బు లు తెచ్చుకుని గ్రామంలో తెలిసిన వ్యక్తులకు అప్పులు ఇచ్చేవాడు. అయితే బాకీదారులు తిరిగి చెల్లించకపోవడం, డబ్బుల కోసం బంధువులు ఒత్తిడి చేశారు. లక్షలాది రూపా యల బాకీని తీర్చే మార్గం లేక ఉదయం భార్య ను బ్యాంక్‌కు పంపి ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరివేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బ్యాంక్ నుంచి ఇంటికి తిరిగి వచ్చిన భార్య ప్రాణాపాయ స్థితిలో వేలాడుతున్న భర్తను చూసి కేకలు వేసింది. స్థానికులు కిందకు దింపి నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఈవిషయమై ముచ్చుమర్రి ఎస్‌ఐ జయశేఖర్ మాట్లాడుతూ విషయం తమ దృష్టికి వచ్చిందని, ఎవరూ ఫిర్యాదు చేయలేదని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే రాక

మహానంది: మండలంలో ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మంగళవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మసీదుపురం,సీతారామాపురం, గోపవరం, బసవాపురం, అబ్బీపురం , మహానందిగ్రామాల్లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. అలాగే జగనన్న కాలనీ లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ, పార్టీ నాయకులతో సమావేశం ఉంటుందన్నారు.

16న ఆలయ వార్షికోత్సవం

వెలుగోడు: వేల్పనూరు గ్రామంలో వెలసిన అంకాల పరమేశ్వరి ఆలయ 5వ వార్షికోత్సవం ఈ నెల 16వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి తెలిపారు. వార్షికోత్సవ ఏర్పాట్లపై సోమవారం ఆలయ కమిటీ సమావేశం నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలి

నందికొట్కూరు: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలని ఆ యూనియన్ నాయకులు కిరణ్‌కుమార్, ప్రసాద్ కోరారు. సోమవారం కొత్తపల్లి మండల పరిధిలోని కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. జయరాములు, ఓబులమ్మ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పగిడ్యాల: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు జెడ్పీటీసీ పుల్యాల దివ్య సోమవారం భూమి పూజ చేశారు. పాల భాస్కరరెడ్డి ఇంటి నుంచి లక్ష్మాపురం రోడ్డుకు, ప్రార్థన దానమ్మ ఇంటి నుంచి మెయిన్ రోడ్డు వరకు పనులు చేపట్టారు. సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పాల్గొన్నారు.



రాజంపేట ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడిని సత్కరిస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యుడు

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యులు బొల్లినేని రామ్మోహన్ నాయుడు, రాజంపేట ఎమ్మెల్యే మేడా వెంకట మల్లికార్జున రెడ్డిని, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. సోమ వారం రాజంపేటలో ఆయన వీరిని కలిసి స్వామి వారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదం అందజేసి సత్క రించారు. క్షేత్రాభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

పెచ్చెరువు మార్గంలో వైద్య శిబిరం

శ్రీశైలం: కాలినడకన శ్రీగిరి వచ్చే వెళ్తున్న భక్తుల కోసం పెద్ద చెరువు వద్ద శ్రీశైల శివసేవా సమితి, వీవీఆర్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఈ నెల ఒకటో తేదీ నుంచి వైద్య శిబిరం ఏర్పాటు చేసి ఉచితంగా సేవలందిస్తోంది. నడిచివచ్చే వారికి నొప్పుల నివారణకు మందులు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 40 వేల మందికి మందులు పంపిణీ చేసినట్లు నిర్వాహకుడు అధ్యకుడు వట్టి వెంకట రెడ్డి తెలిపారు. శిబిరంలో దిలీప్, రేఖ, ప్రసాద్, పూర్ణిమ, భ్రమర, నాగమణి, ఎంవి నారాయణరెడ్డి సేవలు అందిస్తున్నారు.



మందుల పంపిణీ చేస్తున్న దృశ్యం

నీటి సమస్యకు పరిష్కారం

జూపాడుబంగ్లా: గ్రామంలో నీటి సమస్యకు పరిష్కారం చూపేందుకు సోమవారం రూ.2లక్షలు వెచ్చించి రెండు బోర్లు తవ్వించగా పుష్కలంగా నీళ్లు పడ్డాయని పారుమంచాల సర్పంచ్ మాధవరం ప్రకాశం తెలిపారు. కొందరు గ్రామస్తులు ఉద్దేశ పూర్వకంగా ఇదివరకు తవ్వించిన బోరులో రాళ్లు వేయించి పూడ్చటం విచారకరమన్నారు.చేతనైతే గ్రామాభివృద్ధికి సహకరించాలని సూచించారు. రెడ్డి శివారెడ్డి, చిన్నబాబు, పుల్లంరాజు, సాగర్, కర్ణ, రసూల్, రవి, శ్రీను, సురేష్, ఎం.శ్రీను తదితరులు పాల్గొన్నారు.